సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 28 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



మత్స్యకారులకు చేయూత
మత్స్యకారుల జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపుతున్నారు. ఉపాధి కల్పనకు పలు పథకాలు అమలు చేయడంతో పాటు పనిముట్లు అందజేస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.8°/11.1°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూముల పరిశీలన



మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తచెరువు, బుక్కపట్నంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ అరుణ్ బాబు బుధవారం పరిశీలించారు. తొలుత ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి కొత్తచెరువుకు వెళ్లిన కలెక్టర్...స్థానిక చైతన్య, బాలుర ఉన్నత పాఠశాలల్లోని పలు గదులను పరిశీలించారు. అనంతరం బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి గదులతో పాటు పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును తెలుసుకున్నారు. కోడిగుడ్ల పంపిణీ, పౌష్టికాహారం సరఫరా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ స్వాతి, ఎంపీడీఓ బాలస్‌సాబ్, హెచ్‌ఎం అబ్దుల్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ చైర్మన్‌గా మరోసారి మెట్టు



మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) చైర్మన్‌గా రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి మరోమారు నియమితులయ్యారు. 2021లో తొలిసారి నియమితులైన మెట్టును రెండోసారి కూడా కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏపీఐఐసీ చైర్మన్ బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ

- డీఆర్ఓ కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వివిధ వర్గాల నుంచి అందుకున్న ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ చేపడుతున్నామని డీఆర్ఓ కొండయ్య తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫారం-6కు సంబంధించి 90,872 దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో 80,781 దరఖాస్తులు పరిష్కరించామని, మరో 10,086 తొలగించామన్నారు. అలాగే ఫారం-7కు సంబంధించి 62,227 దరఖాస్తులు అందగా, 48,542 పరిష్కరించి 13,617 తిరస్కరించినట్లు వెల్లడించారు. ఫారం-8కు సంబంధించి 60,679 క్లెయింలు అందగా, 57,333 పరిష్కరించి, 3,330 క్లెయిమ్‌లను తిరస్కరించామన్నారు.

గూడు కడుతున్న ఆనందం

"మాకు గతంలో వేరుగా కాలనీలు ఏర్పాటు చేసేవారు. అది అవమానంగా ఉండేది. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వంలో అలా కాదు. మాకు ఇచ్చిన ఇళ్ల పట్టాల ఆధారంగా నంబర్ల ప్రకారం మా ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి లాటరీ తీశారు. అందులో మాకు ఏ ప్లాటు వస్తే అదే ఇచ్చారు. కులాలు, మతాల ప్రస్తావన లేకుండా అందరికీ కలిపి ఒకేచోట ఇళ్లు ఇచ్చారు. కులం పేరుతో దూరంగా పెట్టే విధానం తొలగించడం సంతోషంగా ఉంది."

– కదిరి జగనన్న కాలనీలోని ఓ మహిళా లబ్ధిదారు ఆనందమిది

"మాకిచ్చిన స్థలం విలువ మార్కెట్‌లో సెంటు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా పలుకుతోంది. నిలువనీడలేని నేను ఒక్కసారిగా లక్షాధికారినయ్యా. నిజంగా అంత విలువైన స్థలం ఇస్తారని కలలో కూడా ఊహించలేదు. లేఅవుట్‌లో వేలాది మందికి స్థలం ఇవ్వడంతో పాటు ప్రభుత్వమే అన్ని మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇప్పుడక్కడ ఊరే వెలిసింది. మాలాంటి నిరుపేదల గురించి పట్టించుకున్న ఏకైక సీఎం జగనన్నే.

– ధర్మవరం సమీపంలోని పోతులనాగేపల్లి లేఅవుట్‌కు చెందిన లబ్ధిదారు సంతోషమిది

- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- అన్ని మౌలిక వసతులతో కాలనీల ఏర్పాటు
- సెంటు స్థలం రూ.లక్షల్లోనే...
- ఆనందోత్సాహాల్లో నిరుపేదలు



ధర్మవరం శివారులోని పోతులనాగేపల్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్ (ఇన్‌సెట్) నిర్మాణం పూర్తయిన ఇంటి ముందు ఓ కుటుంబం

కదిరి: కూడు..గూడు..గుడ్డ.. మనిషికి కనీస అవసరాలు. కళ్లుమూసేలోగానైనా కాసింత నీడ సంపాదించుకోవాలనేది ప్రతి నిరుపేద కోరిక. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా చాలామందికి అది తీరని కోరికగానే ఉండేది. కానీ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టాక అర్హులందరికీ పట్టాలిస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా ఇళ్లు మంజూరు చేస్తూ సమాజంలో గౌరవంగా బతికేలా చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో జగనన్న కాలనీల పేరుతో కొత్తగా ఊళ్లే వెలుస్తున్నాయి.

మౌలిక వసతులకు ప్రాధాన్యం..

అర్హత ఆధారంగా ప్రభుత్వం ముందుగా ఇంటి పట్టాలను మంజూరు చేస్తోంది. ఆ తర్వాత జగనన్న లేఅవుట్లలో ఇంటి ప్లాట్లు కేటాయిస్తోంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంటు, ఇనుముతో పాటు అన్ని రకాల సామగ్రిని ప్రభుత్వమే అందిస్తోంది. కొత్తగా నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లో తాగునీరు, ఉచిత విద్యుత్, రహదారులతో పాటు అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేదల పక్కా ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

జిల్లాలో 65 వేల ఇళ్ల నిర్మాణాలు..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 65,629 ఇళ్లను నిర్మిస్తోంది. ఇందులో ప్రారంభ దశలో 19,723, పునాది దశలో 16,214, గోడల దశలో 4,217, పైకప్పు దశలో 2,484 ఇళ్లు ఉన్నాయి. అలాగే 16,919 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేశారు. పట్టణ పరిధిలో ఒక సెంటు, గ్రామీణ పరిధిలో ఒకటిన్నర సెంట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. పట్టణాల్లో ఒక్కో సెంటు విలువ రూ.లక్షల్లోనే ఉంటుంది. అందుకే ఈ కాలనీల్లో పేదలు సంతోషంగా పోటీ పడి మరీ ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

సకాలంలో బిల్లులు..

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోంది. లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు నాటడం, వైర్లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి పనులు జిల్లా వ్యాప్తంగా చకచక జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణం కోసం ప్రతి కాలనీలో నీటి సమస్య లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. పూర్తయిన ఇళ్లకు కరెంటుతో పాటు మంచినీటి కొళాయి కనెక్షన్ సైతం వెనువెంటనే ఇస్తోంది.

నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం సమీక్ష..

ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులతో ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తున్నారు. పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు సైతం గృహనిర్మాణశాఖ అధికారులతో తరచూ సమావేశమవుతూ ఇళ్ల నిర్మాణాల్లో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నారు.

జిల్లాలో 'వైఎస్సార్- జగనన్న' కాలనీల్లోని ఇళ్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	మంజూరు	ప్రారంభ దశ	పునాది దశ	పైకప్పు దశ	పూర్తి
ధర్మవరం	14,439	3,087	6,345	198	3,846
హిందూపురం	11,197	6,804	1,262	63	2,591
కదిరి	6,102	1,403	1,176	162	1,114
మడకశిర	909	49	156	55	516
పెనుకొండ	6,741	814	1,945	269	2,912
పుట్టపర్తి	18,736	5,115	4,029	1,526	3,625
రాప్తాడు	7,505	2,451	1,301	211	2,315
మొత్తం	65,629	19,723	16,214	2,484	16,919

నిర్మాణాలు వేగవంతం



జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పట్టా పొందిన ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకోవాలి. కాలనీల్లో అన్ని మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నాం. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నాం. ఎలాంటి సందేహాలున్నా స్థానిక హౌసింగ్ అధికారులను సంప్రదించవచ్చు.

– వెంకటనారాయణ, పీడీ, హౌసింగ్

మనసున్న ముఖ్యమంత్రి



ఒక్క ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణాలే కాదు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, సున్నావడ్డీ, అవ్వాతాతలకు పింఛన్లు, రైతుభరోసా, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జగనన్న మనసున్న ముఖ్యమంత్రి అన్పించుకున్నారు. పేదల మీద ప్రేమతో వారి జీవితాలు మారాలి, మార్చాలనే తపన పడుతున్నారు. జగనన్నకు ప్రజలంతా తోడుగా ఉంటారు.

– పూల జయమ్మ, కదిరి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

'ఆడుదాం ఆంధ్రా'లో కలెక్టర్ అరుణ్‌బాబు



బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని, అలాగే ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. బుధవారం కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను రెండోరోజు బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ మ్యాచ్ ప్రారంభంలో టాస్ వేయడంతో పాటు కొంతసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, 'ఆడుదాం ఆంధ్రా'తో గ్రామీణ యువతలోని క్రీడా నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ లాంటి ఐదు క్రీడాంశాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. విజేతలుగా నిలిచే జట్లకు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ మంచి ప్రదర్శన ఇవ్వాలని జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్, ఎంపీడీఓ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 18 నుంచి 'ఓపెన్' పది, ఇంటర్ పరీక్షలు

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు 2024 మార్చి 18 నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు సంచాలకులు నాగేశ్వర్‌రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ మార్చి 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా జనవరి 5 నుంచి ఫిబ్రవరి 9వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. పదో తరగతి వారు రూ.500, ఇంటర్ అభ్యర్థులు రూ.1,000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అట్టహాసంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తించే పోలీసులకు ఆటవిడుపుగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. పోలీసులంతా హోదాలు మరచి ఉత్సాహంలో క్రీడల్లో పాల్గొన్నారు. బుధవారం స్థానిక శిరసాని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌కు ఎస్పీ మాధవరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పోలీసులు దైనందిన జీవితంలో విధిగా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడల ద్వారా విధుల్లో ఒత్తిడి సైతం అధిగమించడమే గాక మానసికోల్లాసం, ఆరోగ్యం చేకూరుతుందన్నారు. క్రీడాకారులకు గెలుపోటములు సర్వసాధారణమని, రెండింటినీ సమానంగా తీసుకోవాలన్నారు. పోలీసుల్లో ఐకమత్యం పెంపొందించి క్రీడల్లో రాణించేలా ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం పోలీసులు వివిధ క్రీడాంశాల్లో పోటీ పడ్డారు. విజేతలకు ఎస్పీ మెమెంటోలు, కప్‌లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీలు విజయకుమార్, వాసుదేవన్, పృథ్వీ, సీఐలు కొండారెడ్డి, రాజేంద్రనాథ్ యాదవ్, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, టైటాస్, నారాయణ, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్‌రావ్, రాజు ప్రతాప్‌సింగ్, ఏఎస్ఐ శ్రీరాములుతో పాటు ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ సబ్ డివిజన్ల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేయాలి

- పోలీసులకు డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశం

ధర్మవరం అర్బన్: రాత్రి సమయాల్లో పట్టణంలో గస్తీ ముమ్మరం చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పోలీసులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన ధర్మవరం డీఎస్పీ కార్యాలయం, వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కళాజ్యోతి సర్కిల్‌లో ట్రాఫిక్‌ను పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో ఎక్కువ మంది సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను ఎప్పటికప్పుడు సందర్శించి పాత నేరస్తుల నడవడికలపై నిఘా ఉంచాలన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డీఐజీ వెంట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ మహమ్మద్ రఫీ ఉన్నారు.

సమష్టి కృషితోనే నేరాల నియంత్రణ

- హోదాలు మరచి అంతా కలసి పనిచేయాలని ఎస్పీ ఆదేశం

అమడగూరు: హోంగార్డు, మహిళా పోలీసు, కానిస్టేబుల్, ఎస్ఐ లాంటి హోదాలన్నీ మరచి అందరూ సమష్టిగా పనిచేస్తేనే నేరాల నియంత్రణ సాధ్యమని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. బుధవారం ఆయన అమడగూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్, కంప్యూటర్ గది, రైటర్ గదిని పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించి కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసులు గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. అనంతరం పోలీసుల పనితీరు, సమస్యలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని, సాంకేతిక అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే అందరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం మహిళా పోలీసులతో ప్రత్యేకంగా మాట్లాడారు. సైబర్ నేరాలు, దిశ యాప్ వినియోగం, ఇతర అంశాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ బలరామయ్య, సీసీ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్పీ మాధవరెడ్డి

ఆధ్యాత్మిక కల్పవల్లి.. భక్తరపల్లి



స్వామివార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

- వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఆకట్టుకున్న భూతప్ప, జ్యోతుల ఉత్సవాలు

మడకశిర రూరల్: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో కీలకమైన భూతప్పల పాదస్పర్శ ఘట్టం బుధవారం కమనీయంగా సాగింది. వేలాది మంది భక్తులు జ్యోతులు తీసుకువచ్చి స్వామివార్లకు సమర్పించారు. ఉత్సవంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివార్లకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



స్వామివార్లకు జ్యోతులు తీసుకువస్తున్న భక్తులు



మహిళల పైనుంచి నడిచి వెళ్తున్న భూతప్ప

జ్యోతులు తెచ్చి.. ప్రదక్షిణలు చేసి..

ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు బుధవారం తెల్లవారుజామునే ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి పోటెత్తారు. మహిళలు బియ్యపు పిండి, బెల్లంతో తయారు చేసిన జ్యోతులను తీసుకువచ్చి స్వామివార్లకు సమర్పించారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పలువురు భక్తులు మొక్కు చెల్లించడంలో భాగంగా వేరుశనగ కాయలు, కొబ్బరికాయలు, అరటి పండ్లు తదితర వాటిని గోపురంపైకి విసిరారు. అనంతరం నిర్వహించిన 'పాంజు' ఉత్సవం కూడా భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పాంజుతో తలపై కొడితే కష్టాలు తీరుతాయన్న నమ్మకంతో భక్తులు పాంజుతో తలపై కొట్టించుకునేందుకు పోటీపడ్డారు. అలా పాంజుతో కొట్టిన వారికి కానుకలు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ సురేష్‌బాబు పోలీసు బందోబస్తు నిర్వహించారు. దేవదాయశాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించారు. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు. దాతలు, కమిటీ తరపున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కోర్కెలు తీరతాయని...



నేను భూతప్పల ఉత్సవంలో పాల్గొన్నా. భూతప్ప పాదస్పర్శతో కోరిన కోర్కెలు తీరుతాయని అందరూ చెబుతుంటే ఇక్కడికి వచ్చా. మడిస్నానంతో భూతప్పలు వచ్చే మార్గంలో పడుకున్నా. భూతప్ప నాపై కాలుమోపారు. నా కష్టాలు, కోర్కెలు తీరుతాయని నమ్మకం ఉంది.

– అన్నపూర్ణ, రెడ్డిపల్లి, పెనుకొండ

సర్వే డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం

పుట్టపర్తి అర్బన్: సర్వే, భూ రికార్డులను భద్ర పరిచేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సంస్కరణలతో ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ క్రమంలోనే రెవెన్యూ వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. రీసర్వేలో భాగంగా శాశ్వత భూ హక్కు, భూముల సరిహద్దుల గుర్తింపు, చుక్కల భూముల నిషేధిత చర్యలు, డీకేటీ భూములకు పట్టాలు, శ్మశానాలకు భూముల కేటాయింపు, ఇనాం భూములపై ఆంక్షల తొలగింపు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో వేగంగా సాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను విజయ వంతం చేయాలన్నారు. గుర్తించిన గ్రామ సర్వే నంబర్ల సరిహద్దులను అక్షాంశ, రేఖాంశాలతో ప్రభుత్వ భూమి ల్యాండ్ పార్శెల్ మ్యాప్ సాఫ్ట్‌వేర్ (ఎల్‌పీఎం) రూపంలో పొందుపరచాలని సూచించారు. ఆ తర్వాత పట్టాలను క్యూఆర్ కోడ్‌తో అందించాలని ఆదేశించారు. అత్యాధునిక పద్ధతులతో భూ సమస్యల పరిష్కారానికి డేటా ప్రాసెసింగ్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, సర్వే ఏడీ రామకృష్ణ, సర్వే ఇన్‌స్పెక్టర్ కృపాకర్, డీఐ అంజలీదేవి, రొద్దం సర్వేయర్ మైనుద్దీన్, గోరంట్ల సర్వేయర్ తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లేని వారు ఒక్కరూ ఉండకూడదు

జిల్లాలో ఆధార్ లేని చిన్నారులు, పౌరులు ఒక్కరూ ఉండరాదని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, డీఆర్ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు, రాష్ట్ర రీజినల్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ జావేద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 109 ఆధార్ కేంద్రాలున్నాయని, ఆధార్ కార్డు అప్ డేట్‌పై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. 5 నుంచి 7 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్ల పిల్లలు వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. చిరునామా, ఫోన్ నంబర్, బయోమెట్రిక్, పేరు, నూతన ఆధార్ కోసం సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. 0–5 ఏళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.



డేటా సెంటర్ గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

క్లుప్తంగా

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు


నగదు లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు బుధవారం చేపట్టారు. 44 రోజులకు గానూ రూ.57,08,187 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.48,622 నగదు సమకూరినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. అలాగే 10సింగపూర్ డాలర్లు, 5 సౌదీ అరేబియా రియాల్, 41 యూఎస్ఏ డాలర్లతో పాటు 3.150 కిలోల వెండి, 0.050 గ్రాముల బంగారాన్ని భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీసీ సేవా సమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్ర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక బోర్డుకు సెస్ చెల్లించాల్సిందే


కార్మికశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: సెస్ బకాయిలను సకాలంలో కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లిస్తే సంక్షేమ ఫలాలను కార్మికులకు అందజేయడానికి వీలవుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కార్మిక చట్టాల అమలుపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యనారాయణ, అధికారులు రమణారెడ్డి, సురేష్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భవన నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ వ్యయంలో 1 శాతం సెస్‌ను కచ్చితంగా కార్మిక సంక్షేమ బోర్డుకు వసూలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ మొత్తాన్ని ఎప్పటికప్పుడు కార్మిక శాఖకు చెల్లించాలన్నారు. వివిధ శాఖల నుంచి జాబితాలను తెప్పించుకుని నివేదికలను సిద్ధం చేయాలన్నారు.

కర్ణాటక వాసి ఆత్మహత్య

రొద్దం: మండలంలోని కలిపి పంచాయతీ పరిధిలో ఉన్న శేషాపురం సోలార్ ప్లాంట్ సమీపంలో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వలీబాషా, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని కర్ణాటకలోని బాగేపల్లికి చెందిన వెంకటేసు (45)గా గుర్తించారు. తాను సహజీవనం సాగిస్తున్న మహిళ.. శేషాపురం గ్రామానికి చెందిన మరో వ్యక్తితో రోజూ ఫోన్‌లో మాట్లాడుతుండడం గమనించిన ఆయన మనస్తాపంతో సోలార్‌ప్లాంట్ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. కాగా, చీరతో ఉరి వేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి


శీనానాయక్

ధర్మవరం రూరల్: మండలంలోని నేలకోట తండాలో విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు నేలకోట తండాకు చెందిన శీనానాయక్ (45), శ్రీదేవి దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వంట చేయడానికి కట్టెలు లేవని శ్రీదేవి తెలపడంతో తీసుకువచ్చేందుకు శీనానాయక్ పొలాల వద్దకెళ్లాడు. రైతు శంకర్‌నాయక్ వేరుశనగ పొలం వద్ద కట్టెలు ఏరుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అడవి పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు రైతు శంకర్‌నాయక్ విద్యుత్ కంచెను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మత్స్యకారులకు చేయూత

- జిల్లాలో చేపల పెంపకానికి జగన్ సర్కార్ ప్రోత్సాహం
- ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధికి బాటలు
- చేపల విక్రయానికి అనువుగా ద్విచక్ర వాహనాల అందజేత


కొత్తచెరువులో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా యూనిట్


మత్స్యకారులకు అందజేసిన ద్విచక్ర వాహనాలు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: గత ప్రభుత్వ హయాంలో పూర్తి వెనుకబాటుకు గురైన మత్స్యకారుల జీవితాల్లో జగన్ ప్రభుత్వం వెలుగులు నింపింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఓ వైపు ప్రకృతి కూడా కరుణించి ఎన్నడూ లేనంత విస్తారంగా వర్షాలు కురిసాయి. వంకలు పొటెత్తాయి... వాగులు ఉరకలెత్తాయి.... నదులు ఉధృతంగా ప్రవహించాయి. వెరసి జిల్లాలో ఎటు చూసినా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండు కుండను తలపించాయి. జల వనరులు సమృద్ధిగా అందుబాటులోకి రావడంతో మత్స్యకారుల జీవనోపాధులకు జగన్ సర్కార్ చేయూతనిచ్చింది. చేపల పెంపకంతో వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసింది.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన

మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నాణ్యమైన చేప పిల్లలను అందుబాటులోకి తీసుకువచ్చింది. పోషక విలువలు ఎక్కువగా ఉండే చేపలను ప్రజలకు అందజేయాలనే లక్ష్యంతో చేపల విక్రయాలకు ప్రత్యేకంగా ఫిస్ ఆంధ్రా యూనిట్లను రాయితీతో ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఫిష్ ఆంధ్రా యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చే నిరుద్యోగుల్లో బీసీ జనరల్‌కు 40 శాతం, ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు పెట్టుబడిలో 60 శాతం రాయితీ ఇస్తోంది. ఈ క్రమంలోనే బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జగన్ సర్కార్ చేపట్టిన ఈ చర్యలతో ఓ వైపు మత్స్యకారులు, మరో వైపు నిరుద్యోగులు ఏకకాలంలో ఆర్థికంగా బలపడుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో 80 ఫిష్ ఆంధ్రా యూనిట్లు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోగా ఇప్పటికే 37 యూనిట్లు ఏర్పాటయ్యాయి.

అందుబాటులో నాణ్యమైన చేప పిల్లలు..

గత ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో ఏడాది పొడవునా చెరువులు మరువ పారాయి. దీంతో చేప పిల్లలు వదలడానికి అనుకూలం లేక పోవడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఈ ఏడాది తక్కువ వర్షాపాతం నమోదైనా చిత్రావతితో పాటు పలు చెరువుల్లో చేపల పెంపకానికి అనుకూల వాతావరణం నెలకొంది. దీంతో జిల్లాలోని సీబీఆర్, యోగి వేమన, గుంజేపల్లి రిజర్వాయర్లతో పాటు పేరూరులోని అప్పర్ పెన్నార్ డ్యాం, 32 మండలాల్లోని 223 చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందు కోసం ఇప్పటికే నాణ్యమైన చేప పిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో సిద్ధంగా ఉంచారు.

16 ద్విచక్ర వాహనాలు అందజేత..

చేపల వేట, అమ్మకాల ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న వారికి ప్రభుత్వం అండగా నిలిచింది. అలాంటి మత్స్యకారులకు రూ.75 వేలు విలువ చేసే టీవీఎస్ మోపెడ్ వాహనాలను అందజేశారు. చేపల వేటకు వెళ్లి అనుకోకుండా మృత్యువాత పడితే వారి కుటుంబసభ్యులకు రూ.10 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. ఇక లైవ్‌ఫిష్ విక్రయాలు సాగించేవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లిస్తే రూ.1 లక్ష, రూ.20 వేలు చెల్లిస్తే రూ.2 లక్షలు చొప్పున రుణ సదుపాయం కల్పిస్తూ ఫిష్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయిస్తున్నారు. రెస్టారెంట్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు రూ.20 లక్షల వరకూ రుణాన్ని మంజూరు చేస్తున్నారు. లాంజ్ మోడల్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేసే వారికి రూ.50 లక్షల వరకూ రుణ సౌకర్యం కల్పిస్తారు.

సీఎం జగన్‌తోనే బాగుపడ్డాం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా బలపడ్డాయి. ఫిష్ ఆంధ్రా యూనిట్ల ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతోంది. మేము అడుగకనే మా వ్యాపారానికి అనువైన ద్విచక్ర వాహనాలను అందజేశారు. దీని ద్వారా గ్రామాల్లో చేపల విక్రయం ఎంతో సులువుగా ఉంది.

– నాగేంద్ర, మత్స్యకారుడు, కొత్తచెరువు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం సబ్సిడీపై అంద జేసే ఫిష్‌ఆంధ్రా యూనిట్లను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. సబ్సిడీ కింద ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా యూనిట్లను మంజూరు చేస్తోంది. ప్రస్తుతం 37 యూనిట్లను ప్రారంభించాం. జిల్లాలోని అన్ని చెరువుల్లోనూ చేపల పెంపకానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి

జనవాక్కు

మేలు మర్చిపోను



ఓ అన్నగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నన్ను ఆదుకున్నారు. ఈ మేలును ఎన్నటికీ మర్చిపోను. అన్ని విధాలుగా మా కుటుంబానికి రూ.2,68,376 లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ, రైతు భరోసా, విద్యాదీవెన, విద్యాకానుక, అమ్మఒడి పథకాలతో పాటు ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి రూ.2 లక్షల వరకూ సాయం అందింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంతలా పేదలను ఆదుకున్నది లేదు. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

– రుక్మిణి, గొట్టుగుర్కి, రొళ్ల మండలం

పింఛనే జీవనాధారం



బతుకు తెరువు కోసం పిల్లలు నగరానికి వలస వెళ్లారు. ప్రతి నెలా జగన్ ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నా. ఈ డబ్బుతో కుటుంబ అవసరాలు తీరుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– షంషుద్దీన్, తూమకుంట, హిందూపురం మండలం

ఠంచనుగా పింఛన్



నా భర్త చనిపోయి ఎనిమిదేళ్ల అవుతోంది. నాకు వితంతు పింఛన్ వస్తోంది. గతంలో పింఛన్ సక్రమంగా అందేది కాదు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి నెలా 1వ తారీఖునే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. ఖరీఫ్ పంటల సాగు పెట్టే సమయానికి పంట సాగుకు అవసరమైన రూ.7,500 డబ్బును బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు. గతంలో పంటల పెట్టుబడికి అప్పులు చేసేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. మా గ్రామంలోనే ఆర్‌బీకేల ద్వారా వేరుశనగ విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారు. గతంలో విత్తన వేరుశనగ కోసం చెప్పులు క్యూలో పెట్టి రేయింబవళ్లు పడిగాపులు కాచాం. సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేం.

– జి.లీలావతమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

- మహిళా కూలీ మృతి
- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు


గాయపడిన కూలీలు

పుట్టపర్తి అర్బన్: మహిళా కూలీలతో వెళుతున్న ఆటోను వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ కూలీ మృతి చెందింది. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం కొట్లపల్లికి చెందిన 17 మంది మహిళా కూలీలు కొత్తచెరువు మండలం యర్రబల్లి గ్రామానికి వ్యవసాయ పనులకు నిత్యం వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం పనులు ముగించుకుని మధ్యాహ్నం యర్రబల్లికి చెందిన బాషా ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. మరో రెండు కిలోమీటర్ల దూరంలో కొట్లపల్లి గ్రామం ఉందనగా.. కర్ణాటకలోని పావగడకు చెందిన ఇద్దరు యువకులు (పాములు పట్టేవాళ్లు) మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ వెనుక నుంచి ఆటోను బలంగా ఢీకొన్నారు. ఘటనలో ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తాపడింది. ఆటో కిందపడి కూలీ రామలక్ష్మమ్మ (55) అక్కడికక్కడే మృతిచెందింది. చిన్న గంగమ్మ, అనంతమ్మ, కమలమ్మ, రమాదేవి, సావిత్రమ్మ, మరో మహిళకు కాళ్లు, చేతులు విరిగాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ ప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతి చెందిన రామలక్ష్మమ్మ కుటుంబసభ్యులు ఐదుగురు అయ్యప్ప దీక్ష తీసుకుని ఇరుముడి సమర్పించేందుకు శబరిమలకు వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం వారు అక్కడ స్వామి దర్శనం చేసుకున్నారు. తల్లి మరణ వార్త విన్న వెంటనే వార తిరుగు ప్రయాణమైనట్లు సమాచారం.

31న ఏహెచ్‌ఏ అభ్యర్థులకు పరీక్ష

అనంతపురం అగ్రికల్చర్: పశు సంవర్ధకశాఖ పరిధిలో పనిచేసేందుకు ఆసక్తి కనబరుస్తూ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏ) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 31న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో భర్తీ కానున్న 473 పోస్టులకు 915 మంది అభ్యర్థులు చేసుకోగా.. వీరికి ఈ నెల 31న ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఉంటుంది. ఇందు కోసం అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశాలతో ఎస్ఆర్ఐటీ, అనంతలక్ష్మి, పీవీకేకే, బాలాజీ పీజీ కాలేజీతోపాటు తాడిపత్రిలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల, సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. చీఫ్ సూపరింటడెంట్లు, ఇతర సిబ్బందిని నియమించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు 9.15 గంటలకు పరీక్షా కేంద్రాల్లో ఉండాలి. ఆ తరువాత అనుమతించబోరు.

29న కార్గోలో వస్తువుల వేలం

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి జిల్లాలోని ఏపీఎస్ ఆర్టీసీ కార్గో రవాణా విభాగంలో డెలివరీ కాకుండా నిలిచిపోయిన వస్తువులను వేలం వేయనున్నారు. ఈ మేరకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మోతీలాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలుగా వినియోగదారులు తీసుకెళ్లకుండా వదిలేసిన 36 వస్తువులకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు అనంతపురం డిపో ప్రాంగణంలోని కార్గో కార్యాలయంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

ధర్మవరం అర్బన్: స్థానిక కేశవనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి పడి పూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పి.జె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ పూజలో పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణతో దేవాలయం మారుమోగింది. అనంతరం వేలాది మందికి అన్నదానం చేశారు.


వేదికపై కొలువుదీరిన అయ్యప్ప, కుమారస్వామి, వినాయక, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు


పూజలు చేస్తున్న గురుస్వామి పీజే విజయ్‌కుమార్


పాల్గొన్న అయ్యప్పమాలధారులు, భక్తులు

దుప్పి దాడిలో విద్యార్థికి గాయాలు

వజ్రకరూరు: పాఠశాలకు వెళుతున్న ఓ విద్యార్థిపై దుప్పి దాడి చేసింది. వివరాలు... వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలితండాకు చెందిన బాబూనాయక్ వజ్రకరూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామం నుంచి సైకిల్‌పై పాఠశాలకు బయలుదేరిన బాబూనాయక్... పీసీ కొత్తకోట వద్దకు చేరుకోగానే ఆకస్మాత్తుగా ఓ దుప్పి దాడి చేసింది. అటుగా వెళుతున్న వారు విషయాన్ని గమనించి దుప్పి బారి నుంచి విద్యార్థిని కాపాడి ఉరవకొండలోని ఆస్పత్రికి చేర్చారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని బాలుడి పరిస్థితిపై డాక్టర్లతో ఆరా తీశారు.

Andhra Pradesh State Civil Supplies Corporation Ltd.
(A State Government Undertaking)
District Office: Music Hall, Collectorate Compound, 2nd Floor, C-7,9, Puttaparthi, Sri Satya Sai District - 515134

నం. పి. అడ్మిన్/ఏ.1/ఉ.ప్ర./2023-24/1 తేది : 28-12-2023

ఉద్యోగ ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, శ్రీ సత్యసాయి జిల్లా యందు పనిచేయుటకు ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థులు కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ పద్ధతి పై 1 (ఒక) నెలకు ఏక మొత్తము పై పారితోషకాన్ని పొందుకోరు అభ్యర్థులు ఈ క్రింది పోస్టులకు దరఖాస్తు చేసుకోనవచ్చును.

పోస్టు పేరు	విద్యార్హత	మంజూరు అయ్యిన పోస్టుల సంఖ్య	ఏకీకృత నెలవారీ వేతనం
అకౌంటెంట్ గ్రేడ్-III	ఎం.కామ్ (M.Com)	02	రూ. 27,000/-
టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-III	i) B.Sc. (Agri.) / B.Sc. (Hort) / B.Sc. (Dry Land Agri.) ii) Graduates in Bio-Technology / Science graduates with Specialization in Botany iii) Diploma in Agri. Polytechnic / Organic farming / Land Protection	01	రూ. 22,000/- + 1250/- (TA)
డేటా ఎంట్రీ ఆపరేటర్	ఏదైనా డిగ్రీ (Any Degree)	01	రూ. 18,500/-

కాలపరిమితి : 1 సంవత్సరము, వయస్సు : జనరల్ : 35 సంవత్సరములు, ఎస్.సి./ఎస్.టి./బి.సి. : 40 సంవత్సరములు, ఎంపిక విధానం : తత్సమాన విద్యార్హత నందు పొందిన మార్కుల ప్రాతిపదికన, అదనపు విద్యార్హతలు మరియు సంబంధిత రంగం నందు అనుభవం ఆధారంగా.

ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారంను జిల్లా పౌర సరఫరాల కార్యాలయం నుండి 28-12-2023వ తేదీ నుండి పొంది మరియు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు తమ బయోడేటా, విద్యార్హత పత్రములు మరియు అనుభవ పత్రముల కాపీలతో దరఖాస్తులను జిల్లా పౌర సరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, పుట్టపర్తి, శ్రీసత్యసాయి జిల్లా వారి కార్యాలయమునకు 04-01-2024వ తేది సాయంత్రం 5-00 గంటలలోపు (పనిదినముల యందు మాత్రమే) జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న మా కార్యాలయం నందు సమర్పించవలెను. గడువు మీరిన తరువాత వచ్చిన దరఖాస్తులను ఎటువంటి కారణం చూపకనే తిరస్కరించబడును మరియు ఏ కారణము చూపకనే పై ఖాళీలను రద్దు చేయుటకు కూడా జిల్లా కలెక్టర్, శ్రీసత్యసాయి మరియు వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, విజయవాడ వారికి అధికారము కలదు.

తదుపరి సమాచారం కొరకు సంప్రదించండి
వెబ్‌సైట్ : https://srisathyasai.ap.gov.in/
అసిస్టెంట్ మేనేజర్ : 8500904985

ఇట్లు:
సం/- జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్
శ్రీసత్యసాయి జిల్లా



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామగిరి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... రామగిరి గ్రామానికి చెందిన బెస్త శ్రీనివాసులు (55) స్థానిక అగ్రికల్చరల్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం వ్యక్తిగత పనిపై అనంతపురానికి ద్విచక్ర వాహనపై బయలుదేరిన ఆయన 44వ జాతీయ రహదారిపై పెనుబోలు సమీపంలోకి చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను అటుగా వెళుతున్న వారు 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై రామగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 3 నెలల్లో Diploma/ B.Tech/ LLB/ BL/ Part Time - అన్ని Govt. Jobs కు Eligible, Exams-Feb-2024. గ్యారెంటీ పాస్‌కై కృషి. 7995053670, 9550271042. [C.777291]

■ Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL : FCC: 1800-570-3344 [R-221]

REAL ESTATE

LAND FOR SALE

■ కలికిరి మదనపల్లి హైవే నుండి 5 KM దూరంలో JNTU Eng. College నుండి 5 KM దూరంలో సైనిక్ స్కూల్ నుండి 4 KM దూరంలో అన్ని పంటలకు అనుకూలమైన మంచి నీటి వసతి గల వ్యవసాయ భూమి పొలం 70 ఎకరాలు అమ్మబడును. ✆ 9440271459, 9133338628 [T-4815]

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు. సిటీకాపిటల్ సర్వీస్, విష్ణు, 87690 57367. [T-222]

WANTED

■ గోదావరి బిల్డర్స్ & డెవలపర్స్ అనంతపురము నందు పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్ మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (MBA) కావలెను. సంప్ర : 7337371250, 9000677088 [A-2997]

■ H.P. పెట్రోల్ బంక్, రామ్‌నగర్, అనంతపురం టౌన్ నందు పనిచేయుటకు లేడీస్ / జెంట్స్ క్యాషియర్స్, పంపుబాయ్స్ / పంపు గర్ల్స్ కావలెను. సెల్ : 9490695786. [A-2778]

■ అనంతపురములోని ప్రముఖ ప్రైవేట్ జూనియర్ కాలేజి నందు పనిచేయుటకు Wardens, Tutors, Telecallers, Incharge లు PRO's కావలెను. (Male and Female) Cell : 9866117303, 6281158454. [A-7381]

■ English Classes by an experienced Tutor from Bangalore. Grammar, Phonics, Comprehension, Pronunciation. Contact: 9844385242. [C.777289]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం జీ.18K.ఫోన్: 9640258899/9640468899. [HA-1041]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర।। 9177736926. [M-1167568]

■ మా ఆఫీసులో వర్క్ చేయుటకు లేడీ టెలి కాలర్స్ కావలెను.Q:10th, జీతం:7000 to 15000 + ఇన్సెంటివ్స్. Cont:Cell:9133223529. [A-2785]

■ WANTED : (1) Fruits & Vegetables- Procurement Superviser @ Fresh cart Agro (p) Ltd, KLD Road, ATP (Interview : 28, 29 & 30-12-2023) Cell : 8143697965, 9346612228. [A-1483]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.